ప్రజాశక్తి

శుక్రవారం 12 జూలై 2024 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

సిపిగా రాజశేఖర బాబు

వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా డిల్లీరావు



ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నూతన పోలీసు కమిషనర్‌గా ఎస్.వి.రాజశేఖర బాబు నియమితులయ్యారు. రాష్ట్రంలో 9 మంది ఐపిఎస్‌లను బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. దీనిలో భాగంగా ఎస్‌వి రాజశేఖర్ బాబును విజయవాడ నూతన పోలీసు కమిషనర్‌గా నియమించింది. గతంలో రాజశేఖర్‌బాబు గుంటూరు రూరల్ ఎస్పీగా, లా అండ్ ఆర్డర్ ఎడిషనల్ డిజిగా కూడా పని చేశారు. రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్‌గా ఉన్న రాజశేఖర్ 2006 ఐపిఎస్ బ్యాంచ్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం విజయవాడ సిపిగా ఉన్న పిహెచ్‌డి.రామకృష్ణను బదిలీ చేసింది. గత సాధారణ ఎన్నికల పోలింగ్‌కు కొద్దిరోజుల ముందుగా రామకృష్ణ సిపిగా ఇక్కడ నియమితులయ్యారు. ఆయనను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ప్రొవిజినింగ్ అండ్ లాజిస్టిక్స్). పోలీసు నియామక బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇటీవల వరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.డిల్లీరావును వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, యూనియన్ నేతలు

ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలని తహశీల్దారు ఆఫీసు వద్ద ధర్నా

బందరులో ఆయిల్ రిఫైనరీ !

- 5 వేల ఎకరాలకు అవసరమవుతాయని అంచనా
- సాల్ట్ భూములపై చూపు
- పారిశ్రామిక పార్కుగా ఎన్‌ఒసి



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలోని కోస్తా తీర ప్రాంతంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టు మచిలీపట్నం ప్రాంతంలో ఏర్పాటవుతుందని, దీనికి అవసరమైన వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని బందరు ఎంపి బాలశౌరి గతంలోనే ప్రకటించారు. తాజాగా భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) అధికార బృందం ఈ రిఫైనరీ ఏర్పాటుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో బుధవారం చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టుకు భూములు ఎక్కడ కేటాయిస్తారనేది ఆసక్తిగా మారింది.

సాల్ట్ భూములపై చూపు

రూ.60 వేల కోట్లతో ఏర్పాటైయ్యే ఈ రిఫైనరీ నిర్మాణం నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంపి బాలశౌరి చెప్పారు. దీనికి సుమారు ఐదు వేల ఎకరాల వరకు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఇదే ప్రతిపాదనను బిపిసిఎల్ ప్రతినిధి బృందం సిఎం వద్ద ప్రస్తావించింది. అయితే ప్రయివేటు భూములు సేకరించడం ప్రభుత్వానికి ఆర్థిక భారంగా ఉంటుంది. దీనికితోడు 2019కి ముందు బందరు పోర్టు నిర్మాణం, పరిశ్రమల అవసరాల పేరుతో పరిసర గ్రామాల్లోని 20 వేల ఎకరాల పూలింగ్, సేకరణకు పూనుకోవడం వివాదంగా మారింది. తర్వాత ఎన్నికల్లో దీని ప్రభావం పడింది. ఈ క్రమంలోనే తాజాగా సముద్రతీర ప్రాంతంలోని సాల్డ్ భూముల లభ్యతను పరిశీలిస్తున్నారు. సముద్ర తీరంలో 8,708.29 సాల్డ్ భూములున్నాయి. కృత్తివెన్ను మండలం ఇంతేరు, పాండ్రేక పరిసర ప్రాంతాల్లో వెయ్యి ఎకరాలు ఉండగా, మిగిలిన భూములన్నీ బందరు తీర ప్రాంతంలోనే ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం ఈ భూముల లీజు గడువు ముగిసింది. తిరిగి లీజు పునరద్దరించలేదు. బందరులోని పల్లెతుమ్మలపాలెంలో 6,600 ఎకరాల్లో భారత్ సాల్ట్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. దీని లీజును పునరుద్దరించలేదు. భారత సాల్ట్‌కు కేటాయించిన భూములకు ఎన్‌ఒసి తీసుకుని పరిశ్రమకు కేటాయించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

అల్ట్రాటెక్ బాధితులకు న్యాయం చేయండి... యాజమాన్యంపై చర్యలు తీసుకోండి...

కలెక్టర్ డాక్టర్ సృజనకు సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా నేతల వినతి



కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, పివి.ఆంజనేయులు, కె.శ్రీదేవి, కోట కళ్యాణ్

ప్రజాశక్తి - విజయవాడ : జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు సిపిఎం జిల్లా ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, పి.వి.ఆంజనేయులు, కె.శ్రీదేవి, కోట కళ్యాణ్ కలిశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై చర్చించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను జిల్లా అధికారులు బాధ్యత తీసుకుకుని అమలు చేయించాలని, గాయపడిన కార్మికులు పూర్తిగా కోలుకునే వరకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని, క్షతగాత్రులను పర్మినెంట్ చేయించాలని వినతిపత్రంలో కోరారు. కాంట్రాక్టు కార్మికులకు సిమెంట్ బోర్డు నిర్ణయం మేరకు వేతనాలు చెల్లించాలని, ఫ్యాక్టరీలో చట్ట ప్రకారం ప్రతి ఆరు నెలలకు సేఫ్టీ ఆడిట్ చేయించాలని, ఫ్యాక్టరీ బాధ్యతతో కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, గ్రామ ప్రజలకు ఉచితంగా అన్ని సదుపాయాలతో హాస్పటల్, హైస్కూల్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బూదవాడ గ్రామంలోని యువకులకు, మహిళలకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రామంలో రోడ్లు నిర్మించాలని, శుద్ధిచేసిన తాగునీరు ఇంటింటికీ కుళాయిల ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రాత్రిపూట ఫ్యాక్టరీ వ్యర్థాలను గ్రామంపైకి వదలడాన్ని శిక్షార్హం చేయాలని, లేకపోతే ఫ్యాక్టరీని అక్కడి నుండి తరలించాలని, పరిహారంపై యాజమాన్యం గతంలో ఇచ్చిన హామీలను ఇప్పుడైనా అమలు చేయాలని కోరారు. నిర్లక్ష్యంతో వ్యహరించి కార్మికుల ప్రాణాలు బలితీసుకున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై హత్యానేరం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, ప్రమాదం అనంతరం ఫ్యాక్టరీ వద్దకు వెళ్లిన ప్రజలపై (మిగతా 2లో)

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల అధిక ధరల నియంత్రణకు, ధరల స్థిరీకరణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ జల, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేదలకు నాణ్యమైన కంది పప్పు, స్టీమ్డ్ బియ్యాన్ని తక్కువ ధరకు అందించాలన్న లక్ష్యంతో రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మచిలీపట్నం రైతు బజార్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను గురువారం జాయింట్ కలెక్టర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ ధరలకన్నా తక్కువగా నాణ్యమైన బియ్యం, కంది పప్పును అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో తొలుత రైతు బజార్లకు శ్రీకారం చుట్టిందే ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రైతు బజార్ల ద్వారా రైతులే నేరుగా తమ ఉత్పత్తులను ప్రజలకు విక్రయించే సౌకర్యాన్ని కల్పించామన్నారు. గతంలో తాము మచిలీపట్నంలో రెండో రైతు బజారును ఏర్పాటు చేయగా, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. దీనిని (మిగతా 2లో)



మచిలీపట్నం రైతు బజార్లో ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు

సమన్వయంతో జిల్లా సమగ్రాభివద్ధికి కృషి

రోడ్లు, అతిసార, తాగునీటి సమస్యలపై ఎంపి కేశినేని

ప్రజాశక్తి - విజయవాడ : అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా సమగ్రాభివద్ధికి కషిచేద్దామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సరైన ప్రణాళికలతో, నిధుల సక్రమ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఎంపి కేశినేని, జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన... జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, జీజీహెచ్ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్‌ఏఐకు సంబంధించి (మిగతా 2లో)



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కేశినేని చిన్ని


లారీ ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయిన తల్లీ కొడుకులు

లారీ ఢీకొని యువకుడు మృతి

తల్లికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం మండలం చిన ఆవుటపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం యర్రగుంటపల్లికి చెందిన వి.నాగమణి, ఆమె కుమారుడు వి.శ్యామ్ కుమార్ (28) గురువారం ఏలూరు నుండి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. విజయవాడలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లడానికి నాగమణి తన కుమారుడుతో కలిసి బైక్‌పై వస్తుండగా, చిన ఆవుటపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్యామ్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. నాగమణి తీవ్రంగా గాయపడింది. ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్‌ఆర్‌ఆర్‌లో పవర్ స్కిల్స్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మురళీకష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా పవర్ స్కిల్స్‌పై అవగాహనా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 'స్ట్రీట్ టు స్కూల్", 'స్కూల్ టు స్కిల్స్' అనే నినాదంతో పేద విద్యార్థులకు ఉచితంగా నైపుణ్య శిక్షణను ప్రత్యేక నిపుణులతో ఇస్తున్నామని తెలిపారు. రోజూ రెండు గంటలపాటు ఉచితంగా బోధించడానికి, విద్యార్థులకు ఇంటెన్షిప్, ఉద్యోగ అవకాశాల కల్పనకూ మురళీకష్ణ ట్రస్ట్ వారు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా మురళీకష్ణ ట్రస్ట్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ జోయ్ అన్న, మేనేజర్ ఫర్ ఆపరేషన్స్ అనలైస, లోకల్ డైరెక్టర్ వెంకట స్వామి, అర్జున్‌లకు కళాశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుధాకర్, విజయ్ దీప్, బ్రహ్మయ్య, రోస్లిన్ పాల్గొన్నారు.

జిల్లా బైలాజికల్ సైన్స్ ఫారం ఏర్పాటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గవర్నరుపేటలోని సివిఆర్ ఎంసి హైస్కూల్ ప్లస్ గురువారం ఎన్టీఆర్ జిల్లా బైలాజికల్ సైన్స్ ఫారం ఏర్పాటు చేశారు. సైన్స్ ఫారం గౌరవాధ్యక్షులుగా డాక్టర్ వీటీఆర్ నెహ్రూ, అధ్యక్షులుగా డాక్టర్ మామిడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎన్.వి.జయలక్ష్మి, ఎ.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా వై.నాగ రామారావు, కోశాధికారిగా సిహెచ్.రఘుపతిమ్మ, ఎం.లింగారెడ్డి, కార్యదర్శులుగా వై.ఏడుకొండలు, షేక్ ఎం వలి, షేక్ ఖుద్దూస్, సిహెచ్.శివ, ఎన్ అవని, జి.రాధా, టి.శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


జిల్లా బైలాజికల్ సైన్స్ ఫారం నూతన కమిటీ

నూతన పింఛన్తో కార్మికులకు అన్యాయం

గేట్ మీటింగ్లో ఎంప్లాయిూస్ సంఘ్ నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్‌జెఎసి నాయకుడు, ఎన్‌ఎఫ్‌ఐఆర్, ఎస్‌సీఆర్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు విజయవాడలోని డిఆర్‌ఎం కార్యాలయం మెయిన్ గేటు వద్ద గురువారం ఎంప్లాయిూస్ సంఘ్ ఆధ్వర్యంలో లంచ్ అవర్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వర రావు, ఆకుల రాఘవేంద్ర రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానం కార్మికులకు అన్యాయం జరుగుతుందనీ, ఉద్యోగ విరమణ తర్వాత బిచ్చగాళ్ళుగా తయారు చేస్తుందని విమర్శించారు.

మొదటిపేజీ తరువాయి

అల్ట్రాటెక్ బాధితులకు న్యాయం చేయండి

లారీచార్జి చేసి గాయపరచిన పోలీసులపై, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంపై అల్ట్రాటెక్‌ను కార్మికులు ముందుగా హెచ్చరించినా పట్టించుకోలేదు

ఇంకా వినతిపత్రంలో పేర్కొన్న అంశాలిలా ఉన్నాయి. ఫ్యాక్టరీ కార్మికులు, పరిసర గ్రామాల ప్రజల పట్ల అల్ట్రాటెక్ యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రమాదం జరిగే పరిస్థితులు ఉన్నాయని ఆధారాలతో సహా కార్మికులు ఈ ఘటనకు ముందే 10 రోజులుగా చెప్పినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గతంలో రెండు పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు అరకొర చర్యలతో సరిపెట్టింది. అప్పుడు గాయపడిన వారికి నష్టపరిహారం ఇస్తామని చెప్పినా ఇవ్వలేదు. కాంట్రాక్టు కార్మికులకు రూ.12 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారు. వారికి ఇతర సదుపాయాలు కూడా లేవు. ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు కార్మికులు పేద గిరిజనులు. తీవ్రంగా గాయపడి చావుబతుకుల్లో ఉన్న వారూ పేదలే. ఫ్యాక్టరీ హాస్పటల్ ఉన్నా గ్రామ ప్రజలకు, దానిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా వైద్య సదుపాయం కల్పించడం లేదు. యాజమాన్యం నడుపుతున్న పాఠశాలలో రూ.18 వేల ఫీజు వసూలు చేస్తారని, అందువల్ల తమ పిల్లలు చదవలేకపోతున్నారని తల్లులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి సిఎస్‌ఆర్ కింద నిధులు కేటాయించే అవకాశం ఉన్నా ఏ సంక్షేమ పథకాన్నీ యాజమాన్యం అమలు చేయడం లేదు. కనీసం శుద్ధిచేసిన తాగునీరు కూడా సరఫరా చేయడం లేదు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని నిబంధన ఉన్నా అమలు చేయడం లేదు. మహిళలకు ఫ్యాక్టరీలో ఉపాధి కల్పించడంలేదు. పరిసర గ్రామాల్లోని యువకులకు సరైన ఉద్యోగాలు లేవు. ఈ ఫ్యాక్టరీ కోసం భూములను త్యాగంచేసిన వారిలో కొందరికి ఇప్పటికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఫ్యాక్టరీ నుండి రాత్రి 9 గంటలకు దుమ్ము వ్యర్థాలను వదలడంతో సమీప గ్రామాల్లోని ఇళ్లపై పడుతోంది. ఫలితంగా పలువురు ఊపిరితిత్తుల వ్యాధులతో సహా అనేక వ్యాధులతో బాధపడుతున్నారు. నిబంధనల మేరకు పన్నులు కట్టకపోవడంతో బూదవాడ గ్రామ పంచాయతీ ఆదాయం కోల్పోతోంది. ప్రమాదం జరిగిన తర్వాత ఆందోళనతో ఫ్యాక్టరీ వద్దకు వెళ్లిన ప్రజలను లోనికి రానివ్వలేదు. ఏం జరిగిందో కూడా తెలియనీయలేదు. తోసుకుని లోపలికి వెలితే గేట్లు వేసి సిపిఎం, సిఐటియు నేతలను, మహిళలను పోలీసులు లాఠీలతో చితక బాదారు. కొందరిని గదిలోకి తీసుకెళ్లి చేతివేళ్లపై కొట్టారు. వారికి వైద్య సహాయం కూడా అందించలేదు. కార్మిక శాఖపై ప్రభుత్వ ఆంక్షలు ఉండటం వల్ల తనిఖీలు జరగడంలేదు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఎన్‌టిటిపిఎస్ ప్రమాద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు ధర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టిటిపిఎస్)లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో పర్మినెంట్ కార్మికుడు, ఒక కాంట్రాక్టు కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు. చావు బతుకుల మధ్య ప్రైవేట్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించేలా చూడాలి. గాయపడిన కాంట్రాక్టు కార్మికుడిని పర్మినెంట్ చేయించాలి. ఈప్రమాదానికి కూడా ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం. దానిలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించడం లేదు. ఏడాది క్రితం లిఫ్టు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు చనిపోయారు. రాష్ట్రంలో ఫ్యాక్టరీలు, పరిశ్రమలలో జరుగుత్ను ప్రమాదాల నివారణా చర్యలపై అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలి.

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

కూడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. వచ్చే నెల నుండి రేషన్ షాపుల ద్వారా పంచదార కూడా సరఫరా చేస్తామని మంత్రి కొల్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తొలుత రైతు బజార్లో కూరల ధరలు, రేట్ల పట్టికలు పరిశీలించారు. బోర్డుపై ప్రదర్శించిన ధరలకే విక్రయిస్తున్నది లేనిది వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. విక్రయదారులు, వినియోగదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం వాణి, డీఎస్ఓ వి.పార్వతి, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, తహశీల్దారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

పెండింగ్ ప్రాజెక్టులు, డీపీఆర్, సర్వీసు రోడ్లు, విస్తరణకు ఎదురవుతున్న సమస్యలు తదితరాలపై చర్చించారు. జిల్లాలో అతిసారకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రం సేవలు, జల జీవన్ మిషన్ పనులు, పైపులైన్ల మరమ్మతులు, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల స్థితిగతులు తదితరాలపై చర్చించారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ విజయవాడ బైపాస్ పనుల సత్వర పూర్తికి అవరోధంగా ఉన్న హైటెన్షన్ లైన్ల మార్పును వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కోరారు. పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. నగర ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా ఎన్‌హెచ్-16లో మహానాడు రోడ్డు నుండి నిడమనూరు వరకు మెగా ఫ్లైఓవర్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనపై దష్టిసారించాలన్నారు. ఎ.కొండూరు ప్రాంత ప్రజలకు కిడ్నీ సమస్యలు ఎదురుకాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా తాగునీటి వ్యవస్థల అభివద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కషిచేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులపై సమీక్షించారు. తాగునీటి సరఫరా పనులకు సంబంధించి డీపీఆర్‌లు కూడా తయారు చేయాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంపీల్యాడ్స్, సీఎస్‌ఆర్ నిధుల వినియోగంతో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థల మెరుగుతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పాడైన పైపులైన్లు, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ పార్వతీశం, గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ డీవీ రమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని పాల్గొన్నారు.

రైతుబజార్లలో సబ్సిడీపై సరుకుల పంపిణీ



చల్లపల్లిలో పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్



ఉయ్యూరులో అందిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నిత్యాసర సరుకుల ధరలను నియంత్రిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందించేందుకు ప్రత్యేక కౌంటర్‌ను గురువారం ఉదయం గన్నవరం రైతు బజార్లో ఆయన ప్రారంభించి ప్రజలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో బియ్యం కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండటంతో వినియోగదారులకు నాణ్యమైన సరుకును తక్కువ ధరకు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం మిల్లర్లతో మాట్లాడి పౌరసరఫరాలశాఖ ద్వారా కేజీ రూ.55.85 ఉన్న బియ్యాన్ని రూ.49లకు, కందిపప్పు బహిరంగ మార్కెట్లో కేజీ రూ.181 ఉండగా రూ.160లకే రైతు బజార్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు చలమలశెట్టి రమేష్ బాబు, కోటగిరి వరప్రసాద్, దయాల రాజేశ్వరరావు, జాస్తి వెంకటేశ్వరరావు, ఫణి, పొట్లూరి ప్రసాద్, మద్దినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాల కార్యక్రమాన్ని స్థానిక రైతు బజారులో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ గురువారం చల్లపల్లి రైతుబజారులో ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రైతు బజారుల్లో ఏర్పాటు చేసిన సబ్సిడీ బియ్యం, కందిపప్పు విక్రయకేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, డీటీ కుమార్, ఇంచార్జి ఆర్ఐ కష్ణమోహన్, ఎస్టేట్ అధికారి లంకె బలి చక్రవర్తి, పీడీఎస్ డీటీ నరసింహారావు, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెడన :** రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై కల్పిస్తున్న ప్రతిఒక్క పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాగితం ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక రైతు బజార్లో తక్కువ ధరలకే నిత్యవసర సరుకుల అమ్మకాల స్టాల్ ను ఆయన ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు చలపాటి ప్రసాద్, తాసిల్దార్ ఆర్ రాంబాబు, ఆర్ ఐ మణికుమార్, కౌన్సిలర్ మట్ట శివ పావని, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ హన్ను తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయం స్టాల్స్ ఏర్పాటుచేశారని పెనమలూరు ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. ఉయ్యూరు రైతుబజార్లో పౌరసరఫరాల శాఖ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ విక్రయ దుకాణాన్ని గురువారం ప్రారంభించారు. ఆర్డీవో డి.రాజు, నగ రపంచాయతీ చైర్మన్ వి. సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, టీడీపీ నాయకులు అన్నే శ్రీనివాసబాబు, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీని వాసరావు, కౌన్సిలర్లు, జనసేన నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడ రైతు బజార్ ప్రాంగ ణంలో సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సరసమైన ధరలకు నాణ్యమైన సరుకుల అమ్మకం దుకాణం ప్రారంభించారు. గురువారం గుడివాడ ఆర్డిఓ పద్మావతి, ఎన్డీఏ కూటమి నేతలు దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పద్మావతి, టిడిపి, జనసేన పార్టీల నాయకులు కందిపప్పు ప్యాకెట్లు, బియ్యం బస్తాలను కొనుగోలుదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, గుడివాడ జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, ఎమ్మార్వో ఆంజనేయులు, సివిల్ సప్లైడీ.టీ రంగారావు పాల్గొన్నారు.



గన్నవరంలో పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు



టిడ్కో కాలనీలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

బ్యాంకు నోటీసులపై టిడ్కో లబ్ధిదారుల ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో కాలనీలో బ్యాంక్ నోటీసులు ఇచ్చి దౌర్జన్యం చేసే విధానం ఆపాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్ వద్ద 200 మంది లబ్దిదారులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ ఇచ్చిన హామీ గుడివాడ ఎంఎల్ఏ వెనిగండ్ల రాము నిలబెట్టుకోవాలని, బ్యాంక్ వారు 4 నెలలు గడువు ఇవ్వాలని, కాలనీ స్కూల్, హాస్పిటల్ , పోలీస్ స్టేషన్, సచివాలయం , స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, కళ్యాణమంటపం నిర్మిచటానికి నిధులు ఇవ్వాలని నినాదాలు ఇచ్చారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షురాలు ఆర్.సంగమ్మ అధ్యక్షత వహించగా కార్యదర్శి బసవ అరుణ మాట్లాడుతూ ఋణమాఫి చేసే వరకు పోరాటం చేస్తారా లేదా అని లబ్దిదారులను తీర్మానం ప్రవేశ పెట్టగా ఏకాగ్రవంగా 200 మంది చేతులు పైకి ఎత్తి తీర్మానం ఆమోదించారన్నారు. ఎంఎల్ఏ రాము సామూహిక రాయబారం, కలెక్టర్ కి రుణమాఫి వ్యక్తిగత అర్జీలు పెట్టించాలని, ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానం ఆమోదించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపద్యక్షురాలు మద్దెల దుర్గ, సహాయ కార్యదర్శులు షేక్ గౌస్ , సయ్యద్ నూరిన్నీసా , షేక్ ఛాన్ బాషా, కీళ్ల అప్పలనాయుడు, వంకినేని రంగారావు , మానం హేమ, సభ్యులు కన్యాకుమారి ,శివమ్మ, పార్వతి చినమ్ములు ,హైమావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - గుడివాడ : లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ 49వ అధ్యక్షుడిగా ఉప్పలపాటి సతీష్ ఎన్నికయ్యారు. లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ, లైన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గుడివాడ ఆఫీసర్స్ క్లబ్ లో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన అధ్యక్షులు ఉప్పలపాటి సతీష్, ఝాన్సీ లక్ష్మి లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 200 దేశాలలో విస్తతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లైన్స్ క్లబ్ ద్వారా గుడివాడ శాఖకు 49వ అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన ఉప్పలపాటి సతీష్ విస్తతంగా కార్యక్రమాలు నిర్వహించి క్లబ్ ఉన్నతికి కషి చేయాలని గద్దె శేషగిరిరావు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తులసి బాబు, నూతన కార్యదర్శి వేణుగోపా లస్వామి, కోశాధికారి పోలుకొండ సుబ్రహ్మణ్యం, సంఘమిత్ర కార్యదర్శి గుడివాడ ధనలక్ష్మి, కోశాధికారి కాట్రగడ్డ రజిని తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిశీలన

ప్రజాశక్తి చల్లపల్లి : చల్లపల్లి ఒకటో వార్డులో అభివద్ధి చేస్తున్న హిందూ స్మశాన వాటికను అవనిగడ్డ శాసనమండలి సభ్యులు మండలి బుద్ధప్రసాద్ గురువారం పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ. 15లక్షలతో నిర్మించిన నూతన ప్రహరీ గోడ పరిశీలించారు. గత కొన్నేళ్ళ నుంచి అసౌకర్యంగా ఉన్న ఈ స్మశాన వాటికను దాదాపు రూ.కోటిన్నర అంచనాతో సమగ్ర అభివద్ధి, అన్ని సౌకర్యాల కల్పనకు దాతల సహకారం, మన కోసం మనం ట్రస్ట్, స్వచ్ఛ సుందర చల్లపల్లి రధ సారధులు డాక్టర్ డీ.ఆర్.కే ప్రసాద్ - డాక్టర్ టీ.పద్మావతి పర్యవేక్షణలో చేపట్టనున్న పనులను డీ.ఆర్.కే.ప్రసాద్ వివరించారు. స్మశాన వాటిక అభివద్ధికి మరింతగా దాతల సహాయాన్ని సమీకరిస్తున్నట్లు గ్రామ పెద్దలు సజ్జా చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, వేముల శేషగిరి, తాతా ప్రదీప్, నాదెళ్ల వేణు పాల్గొన్నారు.



అర్జీ సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు బి.కీర్తి, తదితరులు

ఉపాధి కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉపాధి హామీ కార్మికులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు బి.కీర్తి అన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ గురువారం ఆకునూరు గ్రామ సచివాలయంలో వినతిపత్రం అంద జేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాల నుండి వేతనాలు వారి ఖాతాల్లో జమచేయక పోవడంతో ఇల్లుగడపడం కష్టంగా ఉందన్నారు. ఉపాధి కూలీలకు కనీసవేతనం రూ.600 చెల్లించాని, ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించాలని డిమాండ్చేశారు. వీరబత్తిన తాతబ్బాయి, రంగారావు, వెంకట సుబ్బారావు, స్టాలిన్ జోష్ బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నాగాయలంక మండల పరిధిలోని టీ కొత్తపాలెం గ్రామానికి చెందిన బండ్రెడ్డి అప్పారావు(తాత) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకోవడంతో వారి కుటుంబానికి శ్రీకష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ద్వారా రూ పదివేల ఆర్థిక సహాయాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండల వెంకటరావు చేతుల మీదుగా అందజేశారు. గురువారం వెంకటరామ్ జనసేన నాయకులతో కలిసి బసవరావును పరామర్శించి ఆయనకు నగదు సహాయం అందజేయడంతో పాటు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల కంటికి ఆపరేషన్ చేయించుకున్న లేపాక వెంకటేశ్వరరావు ఆయనతోపాటు ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయాల పాలైన ముమ్మారెడ్డి శేషగిరిని కూడా వెంకట్రాం పరామర్శించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.



స్టేడియం అభివృద్ధికి చర్యలు : బండి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నంలోని జిల్లా కోర్టు వద్ద ఉన్న స్టేడియంను జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మితో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ స్టేడియంను అభివృద్ధి పరిచి క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి సారధ్యంలో స్టేడియానికి కావాల్సిన ఆర్థిక వనరులు సమకూరుస్తామని అన్నారు. వర్షపు నీటికి మునుగుతున్న స్టేడియాన్ని మెరక చేయించి చుట్టూ కాంపౌండ్ వాల్ తోపాటు లైటింగ్,వాకింగ్ ట్రాక్, పలు క్రీడాకారులకు కావలసిన వసతులతో పాటు ప్రేక్షకులకు కొరకు కూర్చునే సదుపాయం, తాగునీరు ,కాలకత్యాల తీర్చుకునేందుకు వసతులు ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు మొక్కలు పెంచడం పూర్తిస్థాయిలో స్టేడియం అభివద్ధి ఎన్డీఏ ప్రభుత్వంలో జరుగుతుందని తెలిపారు. జనసేన టిడిపి నాయకులు గడ్డంరాజు, పి.వి.ఫణి కుమార్,అక్కు మంతిరాజా, తిరుమలశెట్టిరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



గన్నవరంలో...



పామర్రులో...

ప్రజాశక్తి-గన్నవరం : గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు 12 14 మెమో తీసుకొచ్చి సంక్షేమ బోర్డు నిర్వీర్యం చేయడానికి పూనుకుందనీ, సంక్షేమ బోర్డుని పునరుద్ధరిస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షుడు రాజనాల సురేష్, జిల్లా సిఐటి యు ఉపాధ్యక్షుడు బేతా శ్రీని వాసరావు, మండల నాయకులు పండు రాజా, హను మాన్ జంక్షన్ నాయకులు వడ్డీ గిరిధర్, రాజులపాటి కొండలు పాల్గొన్నారు. **పామర్రు :** భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, 1214 మెమో రద్దుచేయాలని, సంక్షేమ పథకాలు సంక్షేమ బోర్డు నుండి అమలుచేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వేము పెదబాబు, సిఐటియు పామర్రు డివిజన్ కార్యదర్శి ఓ గంగాధర్ ప్రసాద్ సిహెచ్ రమేష్ , రఘు, ఖాన్, భక్షు, సంషద్ ఆలి, కె. వెంకటరత్నం, అప్పారావు, రామమోహన్, పాండు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతుల చట్టాన్ని అమలు చేయండి : సైదులు

ప్రజాశక్తి-చందర్లపాడు: 2011 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేసి కౌలు రైతులందరికీ కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని తోటరావులపాడు, చింతలపాడు గ్రామాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా నేరుగా భూమి సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2011 భూ ఆధీకృత కౌలు రైతు చట్టంలో మార్పు చేసి భూమి యజమాని అనుమతి తప్పనిసరి చేయడంతో అనేకమంది కౌలు రైతులు కౌలు కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు మన్నేపల్లి



సంతకాలు సేకరిస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

శ్రీనివాసరావు, చీర్ల వెంకటేశ్వరరావు, రెబగొండ్ల చెన్నయ్య, రెబ్బగొండ్ల నరేంద్ర, బండారు శ్రీనివాసరావు, లంబు నాగేశ్వరరావు, రెబ్బగొండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తిరుపతమ్మకు ఆషాడం సారె

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మ వారికి, పరివార దేవతలకు ఆషాడమాసం సందర్భంగా గురువారం గ్రామంలోని మహిళలు సామూహికంగా సారె సమర్పించి పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి రంగుల మండపం దగ్గరకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని అక్కడ నుండి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవస్థానంలోని నిత్య కళ్యాణ మండపం వద్ద ఆషాడ సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండల చైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు) తదితరులు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా చూడాలి

50వ డివిజన్ కార్పొరేటర్ సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: మంచినీటి పొల్యూషన్‌కు నివారణ చర్యలు అత్యవసరంగా చేపట్టాలని సిపిఎం ఫ్లోర లీడర్, 50వ డివిజన్



కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్‌లోని క్వారీ, మహంతపురం, గొల్లపాలెం గట్టు ప్రాంతాలలో కార్పొరేటర్ బోయి సత్యబాబు గురువారం పర్యటించారు. ఖాదర్ వీధిలో గత 20 రోజుల క్రితం మంచినీటి స్కవర్ పాయింట్ క్లీనింగ్ కోసం ఓపెన్ చేసి ఇంజనీరింగ్ సిబ్బంది వదిలివేయడం వల్ల మురికి గుంటగా మారి మురుగునీళ్ల పైపులైన్ ద్వారా కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుందని తెలిపారు. గొల్లపాలెం గట్టు రోడ్లో కాలువలో నీరు వాటర్ పైపులలో కలుస్తున్న విషయమై అధికారులకు ఫిర్యాదు చేయగా పనులు ప్రారంభించారని, ఈ విషయమై కమిషనర్‌కి ఈరోజు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అబ్దుల్ ఖాదర్ వీధిలో బోరింగ్ రిపేర్లు చేయవలసిందిగా క్వారీలో లీకేజీ పైపులు, బోరింగ్ మార్పు చేయవలసిందిగా అధికారులకి తెలియపరచడం జరిగిందన్నారు. మేకల వారి వీధి స్కావర్ పాయింట్ క్లీన్ చేయవలసిందిగా కోరడం జరిగిందని సత్యబాబు తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు దంపతులు, రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబ సభ్యులతో



గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన సేవలో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం అందజేశారు.

సమాన అవకాశాలు కల్పించండి : జనసేన

ప్రజాశక్తి-గంపలగూడెం: గడిచిన సాధారణ ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సంతోషకరమని, నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పందేరంలో భాగంగా, జనసేనకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు చింతలపాటి వెంకటకృష్ణ కోరారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో చేసిన సమిష్టి కృషి వలె పదవుల్లో కూడా ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఎంపీ చిన్ని స్పందించి,హామీ ఇచ్చినట్లు చింతలపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు మనుబోలు శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి ఒట్టి కుంట (బొట్టు) కృష్ణ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పని చేయాలి



ప్రజాశక్తి-మైలవరం: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ లక్ష్మీ ప్రసన్న రాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మైలవరంలో శానిటేషన్ సక్రమంగా జరగడం లేదని సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళిక లేదని, బ్లీచింగ్ సున్నం చలించడం లేదని, గ్రామాల్లో అనాధికారిక లేఔట్ లు ఉన్నాయని అధికారుల దష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనధికారిక లేఅవుట్ల గురించి రాతపూర్వకంగా తెలియజేస్తే పది రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ కొనసాగించాలని వినతి


ప్రజాశక్తి-రెడ్డిగూడెం : కుదప గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోతురాజు పద్మావతి మొదటి నుండి వంట ఏజెన్సీగా పని చేస్తుంది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో అక్కడ ఉన్న టిడిపి నాయకులు బలవంతంగా పద్మావతిని తొలగించి వేరే వారితో వంట చేపించారు. చాలీచాలని వేతనాలతో మొదటి నుంచి పని చేస్తున్న తనను తొలగించారని ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒకు తెలియజేసినా అధికార పార్టీ వారి ఇష్టమని చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మావతి ఎంఇఒ రమేష్‌కు వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-తిరువూరు: విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లి దండ్రులు శ్రద్ధ వహించాలని, అదే విధంగా ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పిల్లలని పంపాలని తిరువూరు మండలంలోని గనుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.ఆదిలక్ష్మీ కోరారు. గురువారం పాఠశా లలో జరిగిన పదవ తరగతి విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదవ తరగతి జీవి తంలో అత్యంత కీలక మైనదని, పదిలో మెరుగైన ఫలితాలుసాధించేందుకు ఉపాధ్యాయ సిబ్బంది చేసే కృషికి, తల్లి దండ్రుల సహకారం కూడా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, రాజేంద్రప్రసాద్, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే ప్రతి సాయాన్ని అందుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని గంపలగూడెం గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఏకరూప దుస్తులను గురువారం అందజేశారు.



స్థానిక ప్రధానోపాధ్యాయులు బి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రేగుల వీరారెడ్డి, మాజీ జడ్పిటిసి సభ్యులు డివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులకు తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

అంగన్వాడీ కేంద్రానికి వస్తువులు వితరణ

ప్రజాశక్తి-మైలవరం: జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడి స్కూల్-2లో చిన్నారులకు అవసరమైన పలు వస్తువులను ప్రవాస భారతీయురాలు పూర్వపు అంగన్వాడి స్కూల్ విద్యార్థిని గీతా సుధా తల్లిదండ్రులు గురువారం అందజేశారు. మైలవరం సిడిపిఓ పుష్పలత, ఎంపిటిసి సభ్యురాలు యరమల



విజయ శ్రీ, కర్నాటి శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, చాపలు అందజేశారు. ఈ కార్యక్రమములో సూపర్వైజర్ అన్నామని, అంగన్వాడీ కార్యకర్త వంగూరు నిర్మలాదేవి, గ్రామ పెద్దలు కేసర వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు : సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల: ఎత్తిపోతల పథకాల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని చెవిటికల్లు, గని ఆత్కూరు పంపింగ్ స్కీముల ద్వారా



ఆయకట్టుకు సాగునీటిని గురువారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సాగు చేసుకునేందుకు పంటలకు పుష్కలంగా నీరు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వం రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉండటమే కాక వాళ్ళ సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తుందన్నారు. ఆయకట్టు రైతులు నారుమళ్లు పోసుకొని నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోగంటి బాబు, నాయకులు కోగంటి విష్ణు, గోగుల గుంట రామకృష్ణ, మోరకొండ ఏడుకొండలు, గుత్తా రత్నం, గని ఆత్కూరు సర్పంచ్ షేక్ ఇబ్రహీం, ఎంపీటీసీ వెంపరాల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన

ప్రజాశక్తి-తిరువూరు: వరి నారుమడిలో ఊద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లక్ష్మీపురం గ్రామంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి పి.పద్మ గురువారం అవగాహన కల్పించారు. ఊద నివారణకు ఎకరా నారుమడికి బ్యూటాక్లోర్ లేదా బెంథి యో కార్బ్ 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి, విత్తిన 7, 8వ రోజున మడిలో నీటిని తీసివేసి పిచికారి చేయాలన్నారు. అలా కాకుండా విత్తిన 14,15 రోజుల నుండి సైహలో ఫాప్ బ్యూటైల్ 10 శాతం 400 మిల్లీ లీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కౌలు రైతు కార్డు కావలసిన రైతులు అప్లికేషన్‌లో భూ యజమాని సంతకంతో పాటు భూయజమాని ఆధార్, పాస్ బుక్ జిరాక్స్, కౌలు రైతు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు రెండు, ఆధార్ జిరాక్స్ తీసుకుని రావాలని విఆర్ఓ లోకేష్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు కె.శాంత కుమారి, రైతులు పాల్గొన్నారు.

మంచినీరు సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ: రక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు నగరపాలకసంస్థ ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కమిషనర్ (జనరల్) డాక్టర్ ఎ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విజయవాడ నగర వ్యాప్తంగా మంచినీటి సమస్య ఉందని అన్నారు. మంచినీటి పైప్‌ల్లోకి శిథిలావస్థలోకి చేరడంతో డ్రైయినేజీ వాటర్ కలిసి దుర్వాసన, మురుగు, మట్టితో కూడిన నీటినే ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తాగాల్సి వస్తోందని అన్నారు. హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు ఆయా మూడు సర్కిల్స్ పరిధిలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయించడంతో పాటు పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టాలని కోరారు. మునిసిపల్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ , కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. 50వ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను ప్రారంభించాలని కోరారు. అశోక చెట్లను వీధుల వెంట నాటించే పనికి నగరపాలక సంస్థ ముందుకు రావాలని కోరారు. ఆగిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే నగర వ్యాప్తంగా దెబ్బతిన్న అంతర్గత రహదారుల మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. దీనిపై ఇన్‌చార్జి కమిషనర్ మాట్లాడుతూ...త్వరగా అన్ని రకాలుగా 50వ డివిజన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర వ్యాప్తంగా రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జూలై 2024

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : ఎంపి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి, పక్కన కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాలను అన్ని విధాలుగా అందిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి జిల్లాలోని పలు అభివద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రధానంగా మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల పురోగతి, జల జీవన్ మిషన్ పథకం, ప్రకాశం బ్యారేజ్ దిగువన నిర్మించ తలపెట్టిన మరో రెండు బ్యారేజీల నిర్మాణం, ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం, సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్ నిధులు, మచిలీపట్నం పట్టణ అభివద్ధి తదితర అంశాలపై విభాగాల వారీగా ఆయన సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా తీర ప్రాంతాలైన అవనిగడ్డ, మచిలీ పట్నం, పెడన, బంటు మిల్లి, కత్తివెన్ను మండలాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అవసరమైన ప్రణా ళికలు రూపొందించాలని అధికా రులకు సూచించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటిని అందించేందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని, అందుకు సంబంధించిన పనులను సమర్ధవంతంగా నిర్వహించ గలిగే ఏజెన్సీకి పనులను అప్పజెప్పే విధంగా చూడాలన్నారు. మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మచిలీపట్నం పోర్టు పనులు దాదాపుగా సంవత్సరం నుండి నిరాటంకంగా కొనసాగుతూ ప్రస్తుతం 20 శాతం మేర పనులు పూర్తయ్యాయని అధికారుల ద్వారా తెలుసుకున్న ఆయన, ప్రణాళిక ప్రకారం 16 బెర్తుల నిర్మాణానికి గాను మొదటి దశలో నాలుగు బెర్తుల నిర్మాణాన్ని నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలని పోర్టు అధికారులకు సూచించారు. రూ.250 కోట్లతో భారతమాల ప్రోగ్రాం ద్వారా పోర్టు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, కేంద్ర ప్రభుత్వం నుంచి సంబంధిత నిధుల మంజూరుకు కషి చేస్తామన్నారు. ప్రకాశం బ్యారేజ్ దిగువన ప్రతిపాదించిన రెండు బ్యారేజ్ ల నిర్మాణాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనమలూరు మండలం చోడవరం, అదే విధంగా మోపిదేవి మండలం బండికొల్లంక వద్ద నాలుగు టిఎంసిల చొప్పున నీటి నిలువ సామర్థ్యంతో నిర్మిస్తామన్నారు. వీటి ద్వారా పరిసర ప్రాంతాలకు రానున్న కాలంలో సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని, బ్యారేజీల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా అవనిగడ్డ నియోజక వర్గంలో ఎదురుమొండి వద్ద నాబార్డు నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామని, ప్రభుత్వం ద్వారా పునఃప్రతిపాదనలు పంపి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో డ్రైనేజీ, తాగునీటి సమస్య ప్రధానంగా నెలకొందని, రాబోయే రోజుల్లో ఈ సమస్యలను అధిగమించేందుకు అమత్ స్కీమ్ ద్వారా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, బందరు ఆర్డిఓ ఎం వాణి, మచిలీపట్నం నగర కమిషనర్ బాపిరాజు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి టి శివప్రసాద్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ తులసీదాస్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు





ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. 2023-24 సంవత్సరం లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో జిల్లాలో తతీయ స్థానాన్ని పొందిన పి మను బాలాజీ నూజివీడు కాలేజీలో త్రిబుల్ ఐటీ లో సీటును సాధించగా, జె సాదిక్ ఒంగోలు కాలేజీలో సీటును సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బివిఎన్ఎల్ పద్మావతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి త్రిబుల్ సీట్లు సాధించిన వీరిని ఎంఇఒ-1 జగన్మోహనరావు, ఎంఇఒ-2 గోపాలరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



ఎంపి బాలశౌరికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మల్లవల్లి రైతులకు పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గం మల్లవల్లి పారిశ్రామికవాడ రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారం అందించాలని కోరుతూ గురువారం మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో ఎంపీ వల్లభనేని బాలశౌరిని, కష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీని జనసేన నాయకులు, మల్లవల్లి రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. జనసేన పార్టీ ఉమ్మడి కష్ణాజిల్లా అధికార ప్రతినిధి శివరామకష్ణ, విజయవాడ రూరల్ మండలం అధ్యక్షులు పొదిలి దుర్గారావు, మల్లవల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : నిరుపేద టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్ కుటుంబానికి చల్లపల్లి ఉప సర్పంచ్ ముమ్మనేని నాని 10వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని బుధవారం సాయమందించారు. మస్తాన్ భార్య మీనా ఇటీవల గుండెపోటుతో కన్నుమూసింది. గురువారం సంతాప కార్యక్రమం(చాలిస్మా) ఉండటంతో పేద కుటుంబానికి మమ్ము నేని రాజకుమార్ అందించిన ఆర్థిక సహాయం రూ.10వేలను చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు బాధితునకు అందించారు. వార్డు సభ్యులు అంబటి భువనేశ్వరరావు, బళ్ళా వాసు, టీడీపీ నేత వేముల హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ గీతాబాయి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలో గురువారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి.గీతా బాయి మాట్లాడుతూ 1990 నుండి ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం పాటిస్తున్నారన్నారు. ఆరోగ్య సంరక్షణను అందిం చటానికి జనాభా సమాచారాన్ని సేకరించుట, విశ్లేషించుట, దానిని ఉపయోగించుటలో ప్రాముఖ్యతను వివరించారు. పెరుగుతున్న జనాభా వలన గర్భధారణ, ప్రసవ సమయంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన, కుటుంబ నియంత్రణ,లింగ సమానత్వం, తల్లుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ ర్యాలీ జిల్లా కార్యాలయం నుండి ప్రభుత్వ సాధారణ వైద్యశాల మచిలీపట్నం వరకు నిర్వహించారు. .ఈ ర్యాలీలో బి .శివ సాంబి రెడ్డి, హెచ్ ఈ ఈ ఓ బి రాజేంద్ర కుమార్, హెచ్. ఈ. జిల్లా మలేరియా విభాగం సిబ్బంది, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ ఇన్సూరెన్సు ప్రీమియంలపై జిఎస్‌టి రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : లైఫ్ ఇన్సూరెన్సు ప్రీమియం, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం పై జి.ఎస్.టి పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి కి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఈయు) నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. గ ఎంపి వి. బాలసౌరి కి ఇన్సూరెన్స్ రంగం లోని సమస్యలను వివరించారు. ట్యాక్స్ మినహాయింపు రద్దు చేయటం, జీ.ఎస్.టి విధించటం వల్ల పాలసీలు చేయటానికి పాలసీదారుల పై భారం పడుతోందని విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించి పరిష్కారం చూపాలని కోరారు. ఎంపి బాలసౌరి మెమోరాండం పైన సానుకూలంగా స్పందిం చారన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు జె. సుధాకర్,జి.కిషోర్ కుమార్, టి. చంద్రపాల్, ఎల్. రాజశేఖర్, వై. స్వామినాథ్, ఎస్ వి. రత్నారావు, డి.వాసు తదితరులు ఉన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవోపీఆర్డి కె దిలీప్ కుమార్ కోరారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద గురువారం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా పారిశుద్ధ కార్మికులతో అక్కడ ఉన్న చెత్తను, జంగిల్ ను శుభ్రం చేయించి బ్లీచింగ్ ను చల్లించారు. అలాగే కురాడ గ్రామపంచాయతీ పరిధిలో నిల్వ ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. గ్రామాల్లో వర్షం కారణంగా మురికి నీరు నిల్వ ఉండటం వల్ల అంటు వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు ఏజెయల్ నరసింహారావు, సి హెచ్ ఉమామహేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.



కృష్ణా వర్సిటీ అభివృద్ధికి విసి జ్ఞానమణి కృషి

• బాధ్యతలు స్వీకరించి రేపటితో ఏడాది



ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గల కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతిగా ఆచార్య జి.జ్ఞానమణి సుమారు ఏడాదిపాటు తన బాధ్యతలను పూర్తిచేసుకున్నారు. గత ఏడాది జూలై 13వ తేదీన విసిగా బాధ్యతలు స్వీకరించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియమితులైన విసిలంతా రాజీనామా చేయాలని వచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది జూన్ 29వ తేదీన రాజీనామా సమర్పించారు. అయితే ఆ రాజీనామాను నేటికీ ఆమోదించలేదు. ఆయన గతంలో ఆంధ్రా యూనివర్సిటీలో 30 ఏళ్లపాటు ప్రొఫెసర్గా, డీన్గా తదితర హోదాల్లో పనిచేశారు. శ్రీకాకుళం జిల్లాలోని అంబేద్కర్ యునివర్సిటీ రిజిస్ట్రార్గా విధులు నిర్వహించారు. కృష్ణా విశ్వవిద్యాలయం విసిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి దాని అభివద్ధికి కృషి చేశారు. తన 11 నెలల 16 రోజుల కాలంలో ఆయన ఎప్పటి నుండో పెండింగ్లో వున్న ప్రధాన గేట్ (ఆర్చ్), 102 ఎకరాల విశ్వ విద్యాలయ ప్రాం గణం చుట్టూ ప్రహరీ గోడ (కాం పౌండ్ వాల్), సర్వ హంగు లతో ఆహారశాల (క్యాంటీన్), సకల సౌక ర్యాలతో ఫార్మసీ కళాశాల నిర్మించారు. బాలికల వసతి గహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. క్రీడాప్రాంగణం నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర క్రీడల శాఖకు రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రముఖ సంస్థల ద్వారా ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 250 మందికి ఉద్యోగ అవకాశాలు లభించేలా చేశారు. సిలికాన్ ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఎంఓయూ చేసుకుని ఐదుగురు విద్యార్థులను ఉన్నత చదువులు నిమిత్తం అమెరికాకు పంపేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే ఎన్ఎస్ఎస్, ఎన్సిసి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఇంకా పలు పలు సేవా కార్యక్రమాలూ చేపట్టారు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో యునివర్సిటీ ప్రాంగణంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు, సిబ్బంది సౌకర్యార్థం ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేసి సీనియర్ నర్స్‌ను నియమించారు. ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థుల అవసరార్థం వర్సిటీ ప్రాంగణంలో ఎస్‌బిఐ ఏర్పాటు చేయించారు. నూజివీడు పిజి సెంటర్లో పరిపాలనా భవనాన్ని, లేడీస్ హాస్టల్ భవనాన్ని పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. జిఒ 110 ద్వారా రెండేళ్లుగా పెండింగ్లో ఉన్న పాత బకాయిల సమస్యను పరిష్కరించారు. గత ఏడాది డిసెంబరులో మూడు రోజులపాటు కష్ణా తరంగ్‌ను ఘనంగా నిర్వహించి గవర్నర్‌ను ఆహ్వానించారు.



ఏటా ఆస్తి పన్ను పెంపును నిలుపుదల చేయండి

ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-విజయవాడ: ఆస్తి పన్నును ఏటా 15 శాతం చొప్పున పెంచడాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుండే నిలిపి వేసి, ఆస్తిపన్ను లెక్కించటానికి చేసిన మున్సిపల్ సవరణ చట్టం 44/2020ని రద్దు చేయాలని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ నగర ప్రధాన కార్యదర్శి ఎంవి ఆంజనేయులు మాట్లాడారు. రాష్ట్రంలో అద్దె విలువ మీద ఆస్తిపన్ను లెక్కించే విధానాన్ని రద్దుచేసి, ఆస్తి కేపిటల్ విలువ మీద ఆస్తిపన్ను లెక్కించే విధానాన్ని గత వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దీనికోసం మున్సిపల్ చట్టాలకు సవరణ చేస్తూ సవరణ చట్టం 44/2020ని తెచ్చిందన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలాల మార్కెట్ విలువ మారినప్పుడల్లా ఆస్తి పన్ను కూడా మారే విధంగా ఆ చట్టంలో నిబంధన విధించారన్నారు. దీనిని పౌర వేదికలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనలు నిర్వహించాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఆస్తిపన్నును సమీక్షిస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిందన్నారు. ఈ వాగ్దానాన్ని నెరవేర్చాలన్నారు. అద్దె విలువ ఆధారంగా ఇంటి పన్నును లెక్కించే పాత పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నగర అధ్యక్షులు బి.సాంబిరెడ్డి, నాయకులు రామరాజు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు చాట్ల విజయకుమార్ - హన్న దంపతుల వివాహ రెండో వార్షికోత్సవం సందర్భంగా తమ తోటి పేదలకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ లో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ విధంగా తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రేమవిందు పేరుతో అన్నదానం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాలను ఇలాగే కొనసాగిస్తూ ఉన్నామనీ తెలిపారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని పాత డానోస్కూల్ ఎదురు గా గల మెకానిక్ షెడ్ అధినేత దేవరాజ్ తన జంట కవలలు చిరంజీవులు మనోజ్, మహేష్ మరియు మణి ల జన్మదినోత్సవంను పురస్కరించుకుని ఈరోజు అన్నపూర్ణ సేవాసమితి - నందిగామ వారి ఆధ్వర్యంలో భారీ ఎత్తున 200 మంది పేద మహిళలకు ఉచిత చీరెలు పంపిణీ చేశారు. గుబ్బాల పేట,జంగాల కాలనీ, గ్యాస్ కంపెనీ వద్ద గుడారాలు వేసుకుని జీవిస్తున్న వారికి మరియు ఉమా కాలనీ లో చీరలు పంపిణీ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ సేవా సమితి అధ్యక్షులు పారేపల్లి సాయిబాబు,అమ్రాన్ బ్యాటరీస్ పూర్ణ,గజేంద్ర మేస్త్రీ,దేవరాజ్ స్నేహితులు మరియు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగామ మండలంలోని మాగల్లు కేకే వృద్ధాశ్రమంలో వెచ్చా సులోచన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లుడు, కుమార్తె వనమా నరసింహారావు (బుల్లెబాయి), పద్మావతి రవ్వ ప్యాకెట్లు, చీరలు పంపిణీ చేశారు.

సిఎం చిత్రపటం ఏర్పాటు

ప్రజాశక్తి-భవానీపురం: 127వ సచివాలయంలో 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష సురేష్ గురువారం యుద్ధప్రాతిపదికన సిఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతం పాడిన తరువాత కూడా కొందరు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై ఉన్న అతి ప్రేమను వదులుకోలేక పోతున్నారని విమర్శించారు.

యువత ప్రమాదాలకు దూరంగా ఉండాలి : డిసిపి



ప్రజాశక్తి-వన్‌టౌన్: యువతరం ట్రాఫిక్ రూల్స్‌ను దిక్కరించి ప్రమాదాల బారిన పడవద్దని, తమ విలువైన ప్రాణమాలను బలిపెట్టవద్దని విజయవాడ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) డి.ప్రసాద్ అన్నారు. విజయవాడ సిటీ పోలీసు, కాకరపర్తి భావనారాయణ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతుందన్నారు. యువత తమ వయస్సు రీత్యా వచ్చిన ఉత్సాహంతో ట్రాఫిక్ రూల్స్‌ను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులే అత్యదికంగా ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. దానివలన ఆ కుటుంబంలోని తల్లిదండ్రుల మనోవ్యథను ఎవరూ తీర్చలేరన్నారు.. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. తప్పనిసరిగా నాణ్యత కలిగిన హెల్మెంట్‌ను వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకపోవటం వలన సగానిపైగా మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంగల లీగల్ సర్వీసెస్ కమిటీ లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ పి.రాము, ఎసిపి వెస్ట్ (ట్రాఫిక్) బి.జనార్ధనరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, ట్రాఫిక్ సిఐలు బి.వెంకటేశ్వరరావు, ఆర్.సూర్యభాస్కర్ పాల్గొన్నారు.

ఎల్‌బిటి ప్రాజెక్టులపై వర్క్‌షాప్ ప్రారంభం



ప్రజాశక్తి-వన్‌టౌన్: సాంకేతిక విద్య, శిక్షణలో భాగంగా వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల సిఎస్ఇ, సిఎస్ఇ ఎన్‌ఓటి వారు ఎడ్యునో రోబోట్స్, విజయవాడ సంస్థవారిచే విద్యార్థులకు సంబంధిత ప్రాజెక్టులపై శిక్షణ ఇవ్వబడుతుందని ఆ కళాశాల కార్యదర్శి సిఎ చిట్టా అమర్ సుధీర్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూడు వారాల పాటు ఈనెల 11వ తేదీ నుండి 30వ తేదీ వరకూ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. సంబంధిత ప్రాజెక్టలో శిక్షణ పొందిన విద్యార్థులు నాలుగో సంవత్సరం తుది ప్రాజెక్టులకు సిద్ధమవుతారు. ఈ నెల 30న కళశాలలో జరుగు వర్క్ షాప్‌లో ప్రదర్శించబడుతాయని, అలాగే పరిశ్రమ నుండి న్యాయమూర్తులచే ఎంపిక చేయబడిన ఉత్తమ ప్రాజెక్టు ప్రోత్సహించబడతాయని సెక్రటరీ తెలిపారు. ఎడ్యునో రోబూట్స్ సిబ్బంది షేక్ బాజీ బాషా (చీఫ్ ట్రైనర్), షేక్ జాహెద్ (ట్రైనర్), జె. సురేష్ (ట్రైనర్), ఎన్.అనిల్‌కుమార్ (జూనియర్ ట్రైనర్) మరియు సహచర బృందం వారిచే విద్యార్థులకు శిక్షణ ఇవ్వబడుతుందని సుధీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కే.రాఘవయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.పతాంజలి శాస్త్రి, డిపార్ట్మెంట్ అధినేతలు పి.శిల్ప, ఎన్.మహాలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందేల జోరు

• చేతులు మారుతున్న లక్షలు • అధికార పార్టీ వాళ్లే ఆర్గనైజర్లు?

ప్రజాశక్తి-గన్నవరం: ప్రభుత్వం మారినా.. ప్రజా ప్రతినిధులు మారినా.. అధికారులు మారినా.. గన్నవరం ప్రాంతంలో పేకాట, కోడి పందేలు ఆగడం లేదు. ఎవడ్రా మమ్మల్ని పట్టుకునేది.. మేమంతా అధికార పార్టీ వాళ్ళం మేము చెప్తే వినాల్సిందే.. అన్నట్లుగా కొంతమంది జూదం ఆర్గనైజర్ల వ్యవహారం కొనసాగుతోంది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. పేకాట, కోడిపందాలకు తాను వ్యతిరేకమని అటువంటి పనులు చేస్తే ఊరుకోనని చెప్తున్నారు. ఆయన పేరు చెప్పుకొని కొంతమంది యువకులు పేకాట, కోడిపందాలు ఆర్గనైజ్ చేస్తున్నారు అనే వాదన ఉంది. పోలీసులను మేనేజ్ చేస్తున్నారని విమర్శ ఉంది. టాస్క్ ఫోర్స్ అప్పుడప్పుడు దాడులు చేస్తున్నా.. గ్రామాల్లో ఆర్గనైజింగ్ జూదం ఆగడం లేదు.

ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరపనేని గూడెం, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, తెంపల్లి, మెట్లపల్లి, గ్రామాల్లో జోరుగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. ప్రతిరోజు లక్షల్లో పేకాట నడుస్తుంది. ఈ పేకాట శిబిరంలోకి వెళ్లిన జూదరుల్లో ఒక్కొక్కరి నుండి రూ.1000 ఫీజు వసూలు చేస్తున్నారు ఆర్గనైజర్లు. మూడు గంటల తర్వాత మళ్లీ ఆట ఆడాలంటే రూ.500 కట్టాల్సిందే. జూదరులకు ఒక మంచినీటి బాటిల్, మూడు పేకాట సెట్లు ఇస్తారట. కూర్చోవడానికి పరదాలు, చాపలు ఏర్పాటు చేస్తారట. అంతే అందుకుగాను ఆ డబ్బులు వసూలు చేసి, కొద్దిగా పోలీసులకు మేనేజ్ చేయడానికి సమర్పించి, మిగిలిన సొమ్ము జేబుల్లో వేసుకుంటున్నారని చెప్తున్నారు. ఒక్కో ఆటలో రోజుకు 20 మంది నుంచి 30 మంది వరకు పాల్గొంటారు. అంటే ఆర్గనైజర్ల ఆదాయం రోజుకు రూ.30 వేలు అన్న మాట. దీనిలో రూ.10 వేలు ఖర్చులకు తీసినా 20 వేలు మిగులుతుందని జూదరులే చెప్తున్నారు. కష్టపడకుండా వచ్చే డబ్బులకు ఆశపడి జూదం కేంద్రాలను పెంచి పోషిస్తున్నారని అంటున్నారు. కోడి పందాలు కూడా వేస్తున్నారు. అక్కడి ఆర్గనైజర్ల ఆదాయం కూడా బాగానే ఉంటుంది. పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదని విమ ర్శలు వస్తున్నాయి. అదేమంటే రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. ఎందుకొచ్చిన తంటాలే అని పోలీసులే కామ్‌గా ఉండి మామూళ్లతో సరి పెట్టుకుంటున్నారని వాదన ఉంది. మామూళ్లు స్టేషన్లో వారానికి ఒకసారి అయ్యవారికి కడుతున్నారని తెలుస్తోంది. ఇక పలువురు కానిస్టేబుళ్లు పేకాట నిర్వాహకులకు కొమ్ముకాస్తూ మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు. ఎవరైనా పై అధికారులు దాడులకు వస్తుంటే ముందస్తుగా సమాచారం ఇస్తున్నారు. స్టేషన్ పరిధి లోని పెద్ద అవుటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆర్గనైజింగ్ పేకాట నిర్వహిస్తున్నా డని ప్రచారం జరుగుతుంది. తెంపల్లి, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. అక్కడ కూడా టిడిపికి, జనసేనకు చెందిన వారే శిబిరాలు నిర్వహిస్తున్నారట. ఇంత జరుగుతున్నా.. హనుమాన్ జంక్షన్ సిఐ కానీ, టాస్క్ ఫోర్స్ పోలీసులు కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. అలాగే సూరం పల్లి, దావాజీ గూడెం, అల్లాపురం, కొండపావులూరులో కోడిపందేలు వేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు పోటీ పడి కోడిపందేలు వేస్తున్నారని పందెం రాయుళ్లే చెప్పటం గమనార్హం. పేకాట జూదం కూడా జోరుగా సాగుతోంది. ఒక్కో సెంటర్ లో లక్షలు చేతులు మారుతున్నాయని జూదరులు చెబుతున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము అంతా జూదంలో పోగొట్టి, మళ్లీ జోదం వాడేందుకు అప్పులు చేయడంతో పాటు ఇళ్లలోని బంగారు వస్తువులను తాకట్టుపెట్టి ఆట ఆడే జూదరులు ఉంటున్నారు. మహిళలు అడ్డం తిరిగితే వారిపై దాడులు చేస్తున్నారు. పేకాట జూదం సంగతి అలా ఉంటే, మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రెండువేల జనాభా గల ఒక్క అల్లాపురంలోనే నాలుగు బెల్ట్ షాపులు రాత్రి తెల్లవారులు నడుస్తున్నాయి అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బుద్ధవరంలోనూ అదే కొనసాగుతోంది. మద్యం సీసాకు 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. మందుబాబుల జేబులు లూటీ చేస్తున్నారు. పెయింట్ షాపుల నియంత్రణ, పేకాట నియంత్రణ బాధ్యతలు పోలీసుల చూడాలి. ఆ పని చేయడం లేదని విమర్శ ఉంది. కొంతమంది కానిస్టేబుళ్లు అధికారి పేరు చెప్పి మద్యం బెల్ట్ షాపుల నుంచి మామూలు వసూలు చేస్తున్నారని వాదన ఉంది. జూదాలపై పోలీసులు ఉక్కుపాదం మోపడం కష్టంగానే కనిపిస్తుంది. జిల్లాలోని టాస్క్ ఫోర్స్ కన్నెర్ర చేస్తేనే ఈ జ్వరం ఆగుతుందని గ్రామాల్లోని మహిళలు అంటున్నారు. ఇప్పటికైనా జూదం నియంత్రిం చాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ సమస్యపై స్పందించాలని, జూదం నియంత్రణకు ఉక్కు పాదం మోపేలా పోలీసులపై ఒత్తిడి తేవాలని మహిళలు విన్నవిస్తున్నారు.

మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: 47వ డివిజన్ కెఎల్ రావు నగర్ ప్రాంతంలో చిన్న చర్చి, అడ్డ రోడ్డు ప్రాంతంలో మంచినీటి పైపులు సమస్య ఉందని, సంబంధిత పైపులైన్లుకు మరమ్మత్తులు చేయించాలని 47వ డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి మక్కెన భాస్కర్‌కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి సంబంధిత అధికారులకు త్రాగునీటి పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం విఎంసి మంచినీటి విభాగం సిబ్బంది కెఎల్ రావు నగర్ చిన్నచర్చి అడ్డ రోడ్డు ప్రాంతంలో త్రాగునీటి పైపులైనుకు సంబంధించి మరమ్మతులు చేపట్టారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గంపలగూడెం: గ్రామపంచాయతీ పరిధిలో సైడ్ కాలువల పూడికతీత పనులు ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. పడుతున్న వర్షపనీరు బయటకు పోకుండా నిలిచిపోతున్నట్లు చెప్పారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలంటే పూడికతీత పనులు అవసరమన్నారు. అందుకే జెసిబి ద్వారా పూడికతీతను పూర్తి చేయనున్నట్లు వివరించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థికి ట్రిపుల్ ఐటిలో సీటు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ గ్రామానికి చెందిన చిమట దయమణికి ట్రిపుల్ ఐటీ సీటు వచ్చింది. మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో 10 తరగతిలో 580 మార్కులు సాధించిన దయమణి ట్రిపుల్ ఐటి ఫలితాలలో ఒంగోలు లో సీటు సాధించింది. ఈ సందర్భంగా దయమణి మాట్లాడుతూ తనకు ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీటు రావడం చాలా సంతోషంగా ఉందని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. అలాగే ట్రిపుల్ ఐటికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, రంగాపురం విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తబిత తెలిపారు. ఎస్ సిరి - నూజివీడు, పి ప్రణ్వి - శ్రీకాకుళం, ఎస్ స్వ్రూపి - ఒంగోలు, సిహెచ్ వర్షిణి - ఒంగోలు సీట్లు సాధించి తమ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు.



పాఠశాలల్లో పోషకాహార పెరటి తోటల పెంపకం : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని 100 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పోషకాహార పెరటి తోటలను పెంచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులకు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సన్‌స్టార్ పాఠశాలలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యా యులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం జిల్లా విద్యాశాఖ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 పాఠశాలల్లో ప్రకతి వ్యవసాయం ద్వారా పోషకాహార పెరటి తోటల పెంపక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ ఉద్దేశంతోనే ప్రకతి వ్యవసాయంపై చిన్నతనం నుండి పిల్లలకు తెలియజేయాలనే సత్సంకల్పంతో పాఠశాల స్థాయి నుండి పెరటి తోటల పెంపక కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఎంఈఓ లు ప్రధానోపాధ్యా యులు పి.ఈ.టిలు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ఒక బందంగా పనిచేసి ప్రతి స్థాయిలోనూ ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. పాఠశాలలో ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులను మినహాయించి మిగిలిన విద్యార్థులకు ఈ కార్యక్రమం పైన సంపూర్ణ అవగాహన కలిగించాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రకతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. జిల్లా విద్యా శాఖాధికారి తహేరా సుల్తానా జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి ఎస్ .వి.నాగేశ్వరరావు నాయక్, జిల్లా సైన్స్ అధికారి మొహమ్మద్ జాకీర్ అహ్మద్, కేవికే కోఆర్డినేటర్ శ్రీలత, సన్‌స్టార్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీరామ్, ప్రధానోపాధ్యాయులు రవికాంత్ పాల్గొన్నారు.

తాకట్టు పెట్టిన బంగారం మాయం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : తాకట్టు పెట్టిన బంగారం మాయం కావటంతో మచిలీపట్నం రైతు బజారు ఎదురుగా ఉన్న యూనిమోని సంస్థకు వినియోగ దారులు తాళాలు వేసి ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. వివరాల్లోకి వెళితే పోతురాజు అనే వ్యక్తి ఐదేళ్ల క్రితం బంగారం తాకట్టు పెట్టి రూ.10లక్షలు రుణం తీసుకున్నాడు. తాకట్టు పెట్టిన పది రోజుల్లోనే బంగారం విడిపించుకునేందుకు వెళ్లగా బ్యాంక్ లో పని చేసే ఓ ఉద్యోగి బంగారాన్ని చోరీ చేశాడని, కేసు పెట్టామని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఐదేళ్లు అవుతున్నా తన బంగారం ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి గురైన పోతురాజు జనసేన నేతలతో కలిసి బ్యాంక్ వద్ద ఆందోళనకు దిగారు. తనకు న్యాయం చేయాలంటూ బ్యాంక్ కు తాళాలు వేసి ఆందోళన చేపట్టాడు.



ఆందోళన చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : పంచాయతీ పరిధిలోని కొత్తపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్ర విద్యార్థులకు కీర్తిశేషులు ఎలవర్తి నాగమణి ఈశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ఉపాధ్యాయులు ఎలవర్తి జగదీష్ కుటుంబ సభ్యులు విద్యార్థులు 40 మందికి భోజనం ప్లేట్లు అందజేశారు. గురువారం పాఠశాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యా యులు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న జగదీష్ మాస్టర్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : వర్ల




మాట్లాడుతున్న వర్ల కుమార్ రాజా

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం పామర్రులోని జడ్‌పి హైస్కూల్లో జరిగిన విద్యార్థుల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదివి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాక్షించారు. అనంతరం గత సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు.

నేడు విద్యుత్తుకు అంతరాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : శుక్రవారం అవనిగడ్డ మండలం కోడూరు రోడ్ లో పాత సబ్ స్టేషన్ లో గల త్రీ ఎం వి ఏ పవర్ ట్రాన్స్ఫార్మర్‌ని అమర్చేందుకు పాత సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో కొంత ప్రాంతంలో పులిగడ్డ, మోదుమూడి, అశ్వారావుపాలెం, రామచంద్రపురం, దక్షిణ చిరువోలు లంక గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి కృష్ణనాయక్ తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని డి ఈ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కోడూరు : నియోజకవర్గంలో ప్రతి ఒక్క ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ సర్పంచులు, కార్యదర్శుల మధ్య సమన్వయం లోపిస్తే సహించేది లేదని, నిరంతరం గ్రామ ప్రజల సమస్యలు గుర్తించి అధికారులకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కువ సమస్యలు ఉన్న మండలం కోడూరు మండలమని ,కోడూరు మండలంలో ప్రధానంగా తాగునీటి సమస్య అధికంగా ఉందని, బుధవారం ప్రకాశం బ్యారేజ్ వద్ద కాలువులకు త్రాగునీరు విడుదల చేశారని, ముందుగా గ్రామాలలో మంచినీటి చెరువును నింపే బాధ్యత గ్రామపంచాయతీ అధికారులు తీసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. గ్రామాలలో మురుగునీటి నిల్వలు ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి అతిసార వ్యాధి, డెంగ్యూ జ్వరాల వంటివి వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ బాగు చేసేందుకు 5 కోట్ల 24 లక్షల నిధులతో డ్రైనేజీ పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు గ్రామ సర్పంచులు ఎంపిటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం సజావుగా అమలు జరపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సజావుగా అమలు జరపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలోని పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, యాప్ తీరుతెన్నులను జిల్లా విద్యాధికారి తహేరా సుల్తానా ను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి అందుతున్న బియ్యం, నూనె, కందిపప్పు, గుడ్లు, చిక్కీలు తదితర వస్తు సామాగ్రి వాటి వినియోగం విద్యార్థుల హాజరు ఎంతమంది విద్యార్థులకు గానూ ఎంతమంది భోజనం తింటున్నారు, ఎంతమంది తినడం లేదు, ఎందుకు తినడం లేదు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఏమైనా కావలసిన పనులకు సంబంధించి సిఎస్ఆర్ నిధులతో పూర్తి చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో భోజన పథకం సరిగా అమలు అవుతుందా లేదా క్రమం తప్పకుండా పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసి పరిశీలించాలన్నారు. ఎంఈఓ లతో ప్రత్యేకించి ఒక వాట్సాప్ గ్రూపు సిద్ధం చేసి ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తామన్నారు. వారితో త్వరలో ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విద్యావ్యవస్థను పటిష్ట పరుస్తామన్నారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాధికారి తోపాటు ఏడీలు ఎం ఏ అజీజ్, మనోహర్ నాయక్, పర్యవేక్షకులు పవన్ కుమార్, సలీం, సముద్రేశ్వరరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని మోటార్ వాహనాల చట్టాల గురించి ప్రయాణికులు తప్పనిసరిగా తెలుసుకోవాలని నందివాడ ఎస్సై ఎం. చంటిబాబు పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం, గుడివాడ డిఎస్పి శ్రీకాంత్ ఆదేశాలపై గుడివాడ రురల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసుబాబు ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నందివాడ ఎస్ఐ ఎన్ చంటిబాబు నిర్వహించారు. అనంతరం సిబ్బంది, స్థానిక ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించని వారిని చట్టాన్ని ఉల్లంఘించిన వారిగా పరిగణించి, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అలాగే గుడివాడ రెండవ పట్టణ పోలీసులు రోడ్డు భద్రత నిబంధనలు గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు రోడ్డు ప్రమాధాలు నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్టణ 2 టౌన్ సిఐ. నాగదుర్గరావు, గుడివాడ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్వామి, కాలేజీ ప్రిన్సపాల్ మణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : హెల్మెట్ ధరించడం వల్ల చాలావరకు రోడ్ ప్రమాదాలలో మరణాలను తగ్గించవచ్చని, గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో జరిగిన విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. యువకులు ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగిన హెల్మెట్ రక్షిస్తుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ద్విచక్ర వాహనం కొని ఇచ్చేటప్పుడు హెల్మెట్ కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వికెఆర్ కళాశాలలో... వికెఆర్ కళాశాలలో ట్రాఫిక్ ఎస్ఐ కేశవరావు , వికె ఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు హెల్మెట్ ఉపయోగాలు, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే కలిగే అనర్థాల గురించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం కళాశాలలో హెల్మెట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కేశవరావు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు దష్టిలో పెట్టుకొని వాహనాన్ని నడపాలని, భధ్రత మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగివుండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.



గుడివాడలో మాట్లాడుతున్న సిఐ నాగ దుర్గారావు



గన్నవరంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి

'అల్ట్రాటెక్' యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- మృతులకు కోటి, క్షతగ్రాతులకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలి
- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట
అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఈ నెల 7వ తేదీ జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై హత్యా నేరం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో దంతాల వెంకటేశ్వర్లు స్వగృహంలో గురువారం జగ్గయ్యపేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి అధ్యక్షతన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డివి కృష్ణ మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం నుండి బాధితులకు రావాల్సిన పరిహారాన్ని వెంటనే అందజేయాలని, గాయపడిన కార్మికులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సిమెంట్ బోర్డు నిర్ణయం మేరకు రూ.41,016 వేతనం చెల్లించాలని, చట్ట ప్రకారం ఫ్యాక్టరీలో ప్రతి ఆరు నెలలకు సేఫ్టీ ఆడిట్ చేయించాలని, గతంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చిన హామీలను ఇప్పుడైనా నెరవేర్చాలని, జగ్గయ్యపేటలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని బర్న్‌వార్డుతో సహా నిర్మించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో యువకులకు, మహిళలకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని, గ్రామాల్లో రోడ్లు నిర్మించాలని, శుద్ధి చేసిన తాగునీరు ఇంటింటికి కుళాయి ద్వారా ఉచితంగా సరఫరా చేయాలని, రాత్రి సమయంలో ఫ్యాక్టరీ వ్యర్థాలను గ్రామాలపై వదలడాన్ని నిలుపుదల చేయాలని, గ్రామాల్లో ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా కల్పించే బాధ్యత ఫ్యాక్టరీ యాజమాన్యం తీసుకోవాలని, సిఎస్ఆర్ నిధులను గ్రామానికి వెచ్చించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన లింగారావు, కటారపు గోపి, గోపి నాయక్, సోమేశ్వరరావు, రావిళ్ల శేషు, దంతాల రాజేశ్వరి, కోట రవికుమార్, షేక్ గౌస్‌మియా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి

మహిళా హక్కుల కోసం పోరాడుదాం

ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి

విజయవాడ రూరల్ : హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలని, మహిళా హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి పిలుపునిచ్చారు. మండలంలోని పైడూరుపాడులో గురువారం జరిగిన ఐద్వా మహాసభ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలు అనేక అవమానాలు అణిచివేతలకు గురవుతున్నారని, ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంటున్నా అనేక వేధింపులకు గురవుతున్నారని వీటిపైనా మహిళా లోకం గర్జించాలన్నారు. పురుషులు మద్యం బారిన పడటంతో చిన్న వయసులోనే మహిళలు వితంతువులుగా మారాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని మద్యంపై యుద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలకు విద్య, ఉపాధి రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు దొప్పల వాణి, కస్తాల రాజ్యం తాళ్లూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో ఇద్దరికి చోటు

ప్రజాశక్తి-గంపలగూడెం: నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఇద్దరు విద్యార్థినులకు చోటు దక్కిందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొల్లె పోగు కిరణ్ కుమార్ తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి ఫలితాల్లో గంపలగూడెం గ్రామానికి చెందిన పి నికిత 580 మార్కులు, వేల్పుల విజయలక్ష్మి 565 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇద్దరికి ట్రిపుల్ ఐటీలో చోటు దక్కడం పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



ఎస్‌సి బాలుర హాస్టల్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకర్గం చందర్లపాడు మండల కేంద్రంలో సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహం మూతపడి చుట్టు పక్కల గ్రామాల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, గత నెల 27వ తేదీ ఎమ్మెల్యే విద్యార్థుల సంక్షేమం దష్టా వెంటనే స్పందిస్తూ, జిల్లా కలెక్టర్ కు లేఖ రాసి వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. కాగా, బుధవారం నాడు మండల కేంద్రం చందర్లపాడులో ఎస్సీ (బాలుర) వసతి గహాన్ని ఎమ్మెల్యే స్థానిక నేతలతో కలసి పునఃప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి మౌలిక వసతులకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ హయాంతో సాంఘీక సంక్షేమ శాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని ఆరోపించారు. ఆ శాఖకు కేటాయించిన నిధులు ఏమయ్యాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సాంఘీక సంక్షేమ వసతి గహాల్లో వసతులు లేవు. విద్యార్థులకు మెనూకు సంబంధించిన బిల్లులు అందటం లేదని మండిపడ్డారు. వీటన్నింటినీ పరిష్కరించడం కూటమి ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలనీ అన్నారు.

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ: గురు పౌర్ణమి సందర్భంగా నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11వ తేదీ గురువారం నుండి 21 వరకు యూనివర్సల్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయని యోగా గురుజి గాడిపర్తి సీతారామారావు, మహిళా యోగా గురుజి కన్నేటి అశ్విని తెలిపారు. ఆసక్తి కలిగిన యోగ సాధకులు ఈ ఉచిత యోగ క్లాసులు వినియోగించుకోవాలని, ఇతర వివరాలకు 9603022042 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

52వ రీజన్ ఆర్చరీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులందరూ క్రీడల్లో రాణించాలని, కేంద్ర ప్రభుత్వ సాయంతో 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు బిడ్ చేయబోతున్నామని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సత్యనారాయణపురంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం జరిగిన 52వ హైదరాబాద్ రీజన్ ఆర్చరీ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్కౌట్ అండ్ గైడ్స్ కలర్ పార్టీతో విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం డిఆర్ఎమ్ నరేంద్ర ఎ పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రీయ విద్యాలయ రీజన్ స్పోర్ట్స్ ఫ్లాగ్ ఆవిష్కరించి బెలూన్లను, శాంతి కపోతాలను గాల్లోకి వదిలారు. ఈ సందర్భంగా ఎంపి మైదానంలో ఆర్చరీ చేతపట్టి లక్ష్యాన్ని చేధించారు. ఎంపి మాట్లాడుతూ ఒలింపిక్ గేమ్స్ జరిగే సమయానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు క్రీడాకారులు కూడా ఎక్కువ మంది సిద్ధంగా ఉండాలన్నారు. అందుకోసం ఇప్పటి నుంచే నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ద్వారా మంగళగిరి స్టేడియం, విజయవాడ స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా సదుపాయలు కల్పించాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదిశేషు శర్మ, వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.వి.రావు, రీజనల్ టోర్నమెంట్ కన్వీనర్ డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పొదిలి నాగ ప్రతిభ, ఏసు బాబు ట్రిపుల్ ఐటిలో సీటు సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు సీటు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఎపిపిటిడి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట
ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని జగ్గయ్యపేట డిపోలో యూనియన్ సభ్యుల సమక్షంలో జెండా వందన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు షేక్ ఇమామ్, డిపో కార్యదర్శి ఎ ఆనంద్, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు జె సాంబశివరావు, డిపో మాజీ కార్యదర్శులు ఎస్ఎన్ రావు, బి కోటయ్య, నంబూరు చలపతిరావు, ఎస్‌కె మీరా పాల్గొన్నారు.

వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి : జడ్జి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నంద్రు విద్యాసాగర్ అధ్యక్షతన పట్టణంలోని కమ్మ కళ్యాణ మండపంలో హెల్మెట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రియాజ్, పట్టణ సిఐ హనీష్ పాల్గొన్నారు. సివిల్ జడ్జి మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్‌ను ఉపయోగించాలని, విధిగా 18 సంవత్సరాలు దాటిన వారు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బండికి సంబంధించిన సిబుక్ ఇన్సూరెన్స్ ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ విజయ్ సుందర్, సుధీర్ న్యాయవాది ఎక్కిరాల, రవికుమార్, కొమ్మినేని మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌కు స్పందన

ప్రజాశక్తి-వినన్నపేట
స్థానిక సత్తుపల్లి రోడ్డులో ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. దాదాపుగా 1200 మంది తమ అర్జీలను అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాధితులకు ఎమ్మెల్యే భరోసానిస్తున్నారు.



సబ్‌ప్లాన్ ప్రకారం నిధులు కేటాయించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎస్‌సి జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం నిధులు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్ కోరారు. కెవిపిఎస్ మండల కమిటీ సమావేశం జె.వెంకట్రావు అధ్యక్షతన పట్టణంలోని డివిఆర్ నగర్ సుందరయ్య భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను చర్చించారు. నటరాజు మాట్లాడుతూ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం ఎస్సీ జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులు జిల్లాల వారీగా, ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్ ద్వారా అభివృద్ధికి వ్యక్తిగత లోన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నూతన విద్యా విధానం వలన గ్రామాలలో చదువుకు దూరం అవటానికి కారణమైన మూసివేసిన స్కూళ్ల తెరిపించి, మౌలిక వసతులు కల్పించి, ఎస్సీ, ఎస్టీ పిల్లలు బడిబాట పట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో నిధులు కేటాయించక నిలిచిపోయిన ఇళ్లను రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జగ్గయ్యపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు పి లక్ష్మి నారాయణ (సిల్వరాజు), ఆదిమళ్ల అబ్రహాం, అంబోజి, విద్యాసాగర్, కె.దేవయ్య, ఎం.తిమోతి, కరిసే మధు, హుస్సేన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

